సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం । 2 । ఫిబ్రవరి । 2023



ధ్వజారోహణం.. దేవతాహ్వానం
పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం విశేష పర్వాలు నిర్వహించారు. - 18లో



వైభవంగా దోపోత్సవం
చెర్వుగట్టు జాతర సందర్భంగా బుధవారం తెల్లవారుజామున దోపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. - 18లో

గరిష్టం/కనిష్టం
31°/15°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

భువనగిరిటౌన్ : బీఎన్ తిమ్మాపురం గ్రామ రైతులకు పూర్తి స్థాయిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ బీఎన్ తిమ్మాపురం పునరావాసంలో భాగంగా కాలనీలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించి ప్లాట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కేవలం ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి చేతులు దులుపుకోవాలని చూస్తుందని విమర్శించారు. గ్రామ రైతులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 11 వేల ఎకరాల డబ్బులను వెంటనే ఇవ్వాలన్నారు. వివిధ కారణాల చేత కొంత మంది రైతుల భూములకు డబ్బులు రాలేదని, వీటిని కూడా వెంటనే ఇవ్వాలని పేర్కొన్నారు.

స్వయం సహాయక సంఘాలపై అధ్యయనం



మహిళా సంఘాల సభ్యులతో చర్చిస్తున్న ఎన్‌ఆర్‌ఎల్‌ఎం బృందం సభ్యులు

బీబీనగర్ : మండలంలోని వెంకిర్యాల గ్రామంలో సెర్ప్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్వయం సహాయక సంఘాల పనితీరుపై వివిధ రాష్ట్రాలకు చెందిన నేషనల్ రూరల్ లైవ్లీవుడ్ మిషన్ బృందం బుధవారం మహిళా సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా పనితీరుపై అధ్యయనం చేశారు. సంఘాల పొదుపు నిర్వహణ, బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి ద్వారా పొందుతున్న రుణాలు, చెల్లింపుల విధానం, జీవనోపాధి పొందుతున్న తీరు తదితర అంశాలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీఓ జోజప్ప, బృందం లీడర్ రామచంద్రారెడ్డి, ఏపీఎంలు శ్రీనివాస్, సుధాకర్, మల్లేష్, నర్మద, శ్రీలత, శ్రీనిధి మేనేజర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి



మొక్క నాటుతున్న కంచర్ల రామకృష్ణారెడ్డి

చౌటుప్పల్ : రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. చౌటుప్పల్ మండల పరిధిలోని పెద్దకొండూర్ గ్రామపంచాయతీ మధిర నక్కలగూడెం గ్రామంలో బుధవారం ఆయన ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తక్కువ నీటి వాడకంతో పంటసాగు ఉంటుందన్నారు. రైతులు వాణిజ్య పంటలపై దృష్టిసారిస్తే ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, సర్పంచ్ కాయితీ రమేష్‌గౌడ్, ఎంపీటీసీ బద్దం కొండల్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ గుండెబోయిన రూపమ్మమల్లయ్య, మాజీ సర్పంచ్‌లు జక్కిడి రాంరెడ్డి, బద్దం పాండురెడ్డి, రైతులు గుండెబోయిన అయోధ్యయాదవ్, కూసుకుంట్ల రాంరెడ్డి, యాస మోహన్‌రెడ్డి, యంపల్ల కొండల్‌రెడ్డి, దూర్క వెంకటేష్, యాస బుచ్చిరెడ్డి, కిష్టయ్య, అండమ్మ, రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వరి పైరును పరిశీలిస్తున్న మధుశేఖర్

రాజాపేట : శీతాకాలంలో వరిపంటకు వచ్చే తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాకం కేంద్రం శాస్త్రవేత్త మధుశేఖర్ అన్నారు. బుధవారం రాజాపేట మండలంలోని రాజాపేట, నర్సాపూర్, బొందుగుల గ్రామాల్లో వరి పొలాలను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాండం తొలుచు పురుగు, సూక్ష్మపోషకాలలోపం ఉన్నట్లు గుర్తించారు. దీని నివారణకు కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎంఎల్, 400 గ్రాములు ఒక ఎకరానికి, లేదా ఫిప్రోనిల్ 400 ఎంఎల్ ఒక ఎకరానికి, లేదా కోరాజిన్ 60 ఎంఎల్ ఒక ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. వారి వెంట మండల వ్యవసాయ అధికారి మాధవి, ఏఈఓలు నారాయణ, పాల సంఘం చైర్మన్ గాండ్ల నర్సింగరావు, రైతులు ఉన్నారు.

ఆశ.. నిరాశ



- కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు
- వ్యవసాయానికి ప్రోత్సాహం
- మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు
- బీబీనగర్ ఎయిమ్స్‌కు నిధులు
- ఉపాధి హామీ పథకానికి భారీగా తగ్గిన నిధులు
- 3.50 లక్షల ఉపాధి కూలీలపై ప్రభావం





సాక్షి, యాదాద్రి : కేంద్ర బడ్జెట్‌పై జిల్లా ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఏడు ప్రధాన అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ సమిష్టి ప్రగతి దిశగా చర్యలు చేపడుతున్నామని చేపట్టిన బడ్జెట్‌తో జిల్లా ప్రజల్లో కొంత ఆనందం, కొంత నిరాశ వ్యక్తమవుతోంది. జిల్లాలో వ్యవసాయం, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, ఉపాధి హామీ, చేనేత పరిశ్రమలు, మహిళా సంఘాలకు రుణాలు, రైతు రుణాల వంటి అంశాలపై ప్రజల్లో పరస్పర విరుద్ధ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ యాంత్రీకరణకు ప్రోత్సాహం, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఆదాయ పన్ను పరిమితిని రూ.7లక్షలుగా ప్రకటించడం ఊరటనివ్వగా.. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకానికి నిధుల తగ్గింపు గ్రామీణ కూలీలకు నిరాశే మిగిల్చింది. కాగా.. ఉద్యోగులకు కొంత ఊరట కలిగింది.

వ్యవసాయానికి పెద్దపీట
బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట వేశారు. గత బడ్జెట్‌లోనే ప్రతిపాదించిన పురుగు మందుల పిచికారీ కోసం డ్రోన్ల వాడకంతో అన్నదాతలకు మేలు జరుగుతుందని చిన్న, సన్నకారు రైతులకు తక్కువ ధరలో వీటిని అందుబాటులోకి తెస్తే.. వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయని, నాబార్డు ద్వారా వ్యవసాయ, గ్రామీణ స్టార్టప్‌లకు ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. దీంతోపాటు జిల్లాలో 2.63 లక్షల మంది రైతులకు లబ్ధిచేకూరనున్నది. అదే విధంగా సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం అందిస్తే జిల్లాలో 10వేల మంది రైతులకు లబ్ధి జరగనుంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రూ.6వేల సాగు సాయం జిల్లాలో లక్ష మంది రైతులకు అందనుంది. దీంతోపాటు వ్యవసాయంలో యాంత్రీకరణ, సాంకేతికత వినియోగానికి పెద్దపీట వేసింది. సేద్యాన్ని స్మార్ట్ చేసేందుకు భూ రికార్డుల డిజిటలీకరణ, వ్యవసాయ స్టార్టప్స్‌కు చేయూత, ప్రత్యేక నిధి ఏర్పాటు వంటి అంశాలు రైతులకు ఉపకరించనున్నాయి.

ఎయిమ్స్ ఆస్పత్రులకు నిధులు
దేశంలోని 22 ఎయిమ్స్ ఆస్పత్రులకుగాను బడ్జెట్‌లో రూ.6835కోట్ల నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా బీబీనగర్ ఎయిమ్స్‌కు నిధులు అందనున్నాయి.

కొనసాగనున్న వడ్డీ లేని రుణాలు
మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనిచ్చే విధంగా వడ్డీలేని రుణాలను కేంద్రం ఇస్తుందని మంత్రి ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 15 వేల మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో సుమారు 1.55 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. తాజా కేంద్ర బడ్జెట్‌లో సమభావన సంఘాలకు వడ్డీలేని రుణాలు మరో ఏడాది పాటు అందనున్నాయి.

ఎంఎస్‌ఎంఈలకు చేయూత
నష్టపోయిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ)కు ఆర్థిక సాయం అందనుంది. చౌటుప్పల్, భువనగిరి, బీబీనగర్ పారిశ్రామిక వేత్తలకు, ఇతర చిన్న తరహా పారిశ్రామికవేత్తలకు చేయూతనిచ్చేందుకు బడ్జెట్ కేటాయింపులు చేశారు. దీంతో జిల్లాలో సుమారు 15 వేల ఎంఎస్‌ఎంఈలకు లబ్ధిచేకూరనున్నది.

ఉద్యోగులకు కొంత ఊరట
కేంద్ర బడ్జెట్‌తో సగటు ఉద్యోగులకు కొంత ఊరట కలగనుంది. గత ఫిబ్రవరి నాటి బడ్జెట్‌లో ఆదాయ పన్ను పరిమితిని రూ.2.5లక్షలుగా ప్రకటించింది. ఈ పరిమితిని తాజా బడ్జెట్‌లో రూ. 3లక్షలకు పెంచింది. అంతే కాకుండా రూ. 3 లక్షల నుంచి రూ. 6లక్షల ఆదాయం వరకు పన్ను 10 శాతం ఉండగా ప్రస్తుతం 5శాతానికి తగ్గించారు. దీంతో ఉద్యోగ వర్గాల్లో కొంత మేర ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు 8 వేల మంది ఉండగా, వీరిలో రూ.3లక్షల వేతనం పొందే వారు దాదాపు 3 వేల మంది దాకా ఉంటారని అంచనా. అదే విధంగా 5లక్షల వరకు ఆదాయం పొందే ఉద్యోగులు మరో 5 వేల మందివరకు ఉన్నారు.

ఉపాధి కూలీలకు నిరాశ
గ్రామాల్లో ఎక్కువ మంది కూలీలకు ఉపాధి కల్పిస్తున్న సంఖ్య పెరిగింది. అధిక శాతం ఉపాధి హామీ పథకానికి భారీగా నిధులు తగ్గాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడంతో రైతులు ఉపాధి కూలీల సంఖ్య భారీగా పెరిగింది. ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు ఉపాధి కూలీలలో నిరాశను మిగిల్చాయి. గత బడ్జెట్‌లో ఈ పథకానికి రూ. 89వేల కోట్లు కేటాయించగా.. ప్రస్తుతం రూ. 60 వేల కోట్లు ఇచ్చారు. అయితే నిధుల తగ్గింపు జిల్లాలోని 3.50 లక్షల ఉపాధి కూలీలపై ప్రభావం చూపనుంది. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 1.50 లక్షల మంది కూలీలకు 2.99 లక్షల పనిదినాలు కల్పించారు. బడ్జెట్‌లో నిధుల తగ్గడంతో పని దినాలు తగ్గి కూలీలు ఉపాధి కోల్పోయే అవకాశం ఉంది.

యాదాద్రి ఎంఎంటీఎస్‌కు నిధులు కేటాయించలేదు



హైదరాబాద్ నుంచి యాదాద్రి దేవస్థానం వరకు ఎంఎంటీఎస్ సౌకర్యానికి నిధులు మంజూరు చేయలేదు. నిరుపేదలకు ఈ బడ్జెట్ వల్ల ఎలాంటి ఉపయోగం లేదు. బీజేపీ నాయకులు పలు సమస్యలపై చెప్పినప్పటికీ నిధులు రాబట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. మూసీ ప్రక్షాళనకు నిధులు విడుదల చేయలేదు. వలస కార్మికులకు ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.
– కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

ఉపాధి హామీ పథకానికి ఉరి



కేంద్ర బడ్జెట్లో గ్రామీణ ఉపాధి హామీ ఆహార సబ్సిడీ రైతులకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీలపై భారీ ఎత్తున కోత విధించడం గ్రామీణ ప్రాంత పేదల నోట్లో మట్టి కొట్టినట్లే. గ్రామీణ ఉపాధి హామీకి గత బడ్జెట్లో రూ.89 వేల కోట్లను కేటాయించిన మోదీ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించింది. 40 శాతం పైగా నిధులను తగ్గించడం అంటే.. దేశంలో 15 కోట్ల కుటుంబాలను ఉపాధి హామీకి దూరం చేయడమే అవుతుంది.
– కొండమడుగు నర్సింహ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

బడ్జెట్‌తో ఒరిగిందేమీ లేదు



కేంద్ర బడ్జెట్‌లో ఆర్భాటం తప్ప జిల్లాకు ప్రయోజనం శూన్యం. బడ్జెట్‌తో జిల్లాకు ఒరిగిందేమీలేదు. సాగు నీరు కోసం ఉపయోగిస్తున్న మూసీ కాల్వను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. కానీ బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. బీబీనగర్‌లోని ఎయిమ్స్‌కు కొంత మేర నిధులు కేటాయించారు.
– ఎండీ జహంగీర్, సీపీఎం జిల్లా కార్యదర్శి

బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం



కేంద్ర బడ్జెట్ పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆదుకునే విధంగా ఉంది. ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం. రైతులు, మత్స్యకారులు, నిరుద్యోగ యువత, పన్ను చెల్లింపుదారులకు ఊరటనిస్తుంది. అన్ని వర్గాల అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుంది.
– పీవీ శ్యాంసుందర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కొంత ఊరట



కేంద్ర బడ్జెట్ ఉద్యోగులకు కొంత ఊరటనిచ్చింది. ఇన్‌కమ్ టాక్స్ స్లాబ్ రూ. 10లక్షలకు పెంచుతారని భావించినా రూ. 3లక్షలకు పరిమితం చేశారు. అయితే పన్ను శాతం తగ్గించడం కాస్త ఊరటనిచ్చే విషయం. ఆశించినంత కాకపోయిన ఆదాయ పన్ను పరిమితిని పెంచడంతో వీరందరికీ లబ్ధి చేకూరినట్లేనని భావిస్తున్నాం.
– మందడి ఉపేందర్‌రెడ్డి, టీఎస్‌జీఓ జిల్లా కార్యదర్శి

పనితీరు ప్రశంసనీయం

- కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షి,యాదాద్రి : జిల్లాలో స్వయం సహాయక సంఘాల పనితీరు ప్రశంసనీయంగా ఉందని, రుణాల తిరిగి చెల్లింపు 99 శాతం ఉన్నదని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. బుధవారం జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్‌కు సంబంధించిన 26 మంది నేషనల్ రిసోర్స్ పర్సన్స్ బృందం కలెక్టర్‌ను కలిశారు. అంతకుముందు ఈ బృందం బీబీనగర్‌లోని వెంకిర్యాల గ్రామం, భువనగిరి మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో స్వయం సహాయక సంఘాల పని తీరును పరిశీలించారు. బ్యాంకు రుణాల ద్వారా వారు పొందుతున్న జీవనోపాధి, రుణాల తిరిగి చెల్లింపులపై స్వయంగా సహాయక మహిళా సంఘాల సభ్యులను క్షేత్ర స్థాయిలో అడిగి తెలుసుకున్నారు. అనంతరం బృందం సభ్యులు కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో 14,645 మహిళా స్వయం సహాయక సంఘాల్లో 1,56,000 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని, 565 గ్రామ సంఘాలు, 17 మండల సమాఖ్యలు, ఒక జిల్లా సమాఖ్య పని చేస్తుందని పేర్కొన్నారు. ఈ సంఘాలకు ఈ సంవత్సరం ఇప్పటివరకు రూ.427 కోట్ల రుణాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఓ ఉపేందర్‌రెడ్డి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన బదిలీల ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు

- దరఖాస్తు చేసుకున్న 1,799 మంది ఉపాధ్యాయులు

భువనగిరి : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు బుధవారం నాటికి ముగిసింది. జిల్లాలో బదిలీల కోసం మొత్తం 1799 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్నారు. గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తుల గడువు ఉంది. ఆన్‌లైన్‌లో ఏర్పడిన సాంకేతిక కారణాల వల్ల గడువును పెంచాలని ఉపాధ్యాయ సంఘాల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఫిబ్రవరి 1 వరకు పొడిగించారు. దీంతో జిల్లాలో ప్రస్తుతం 2,800 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో బదిలీలకు అర్హులుగా 2,400 మంది ఉన్నారు. ఇందులో 1,799 మంది దరఖాస్తులు చేసుకోగా ఇంకా 401 మంది దరఖాస్తులు చేసుకోలేదు. మిగిలిన 400 మంది 317 జీఓ ద్వారా జిల్లాకు వచ్చిన వారు కావడంతో వీరికి రెండు సంవత్సరాల సర్వీసు పూర్తికాలేదు. కాగా దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు తన హార్డ్ కాపీలను గురువారం అందజేయాల్సి ఉంది.

కొనసాగుతున్న సీనియారిటీ జాబితా పరిశీలన
ఇప్పటికే సీనియారిటీ, స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందే వారికి సర్వీసు, ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేశారు. వీటిపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి వాటిని వెబ్‌సైట్‌లో పొందుపర్చే ప్రక్రియ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కొనసాగుతుంది.

భూ నిర్వాసితులకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి



ఇళ్ల స్థలాల పంపిణీ కోసం లాటరీ తీస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భువనగిరి : నృసింహ సాగర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న భూ నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. బీఎన్ తిమ్మాపురం గ్రామ భూ నిర్వాసితులకు భువనగిరి పట్టణ శివారులోని 107 సర్వే నంబర్ భూమిలో పునరావాసం కింద లాటరీ ద్వారా ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నృసింహ సాగర్ రిజర్వాయర్ నిర్మాణంలో బీఎన్ తిమ్మాపురం గ్రామ ప్రజల త్యాగాలు ఎప్పటికీ మర్చిపోలేనివని తెలిపారు. గ్రామ నిర్వాసితులకు ఏర్పాటు చేస్తున్న పునరావాసం కింద అందిస్తున్న ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో త్వరలోనే విద్యుత్, నీటి వసతులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. బీఎన్ తిమ్మాపురం గ్రామ భూ నిర్వాసితులకు గతంలో 655 మందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.7.61 లక్షల చొప్పున మొత్తం రూ.50కోట్లు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. మిగిలిన 401 మందికి లబ్ధిదారుల ఖాతాల్లో కూడా జమ అవుతుందన్నారు. అనంతరం మొత్తం 1056 మందికి లాటరీ ద్వారా ఒక్కొక్కరికి 200 గజాల చొప్పున కేటాయించారు. ఉదయం ప్రారంభమైన ఇళ్ల స్థలాల పంపిణీ సాయంత్రం వరకు కొనసాగింది. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ కోల్పుల అమరేందర్, ఆర్డీఓ భూపాల్‌రెడ్డి, ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ పిన్నం లత, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజాప్రతినిధుల దిగ్బంధం



కార్యాలయంలో ప్రజాప్రతినిధులను ఉంచి బయటి నుంచి తాళం వేసిన గ్రామస్తులు

భువనగిరి : భూ నిర్వాసితులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించిన తర్వాతే ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనాలని డిమాండ్ చేస్తూ బీఎన్ తిమ్మాపురంలో బస్వాపూర్ నిర్వాసితులు బుధవారం ఆ గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ భర్తలు రాజు, ఆంజనేయులు, ఉప సర్పంచ్, మాజీ సర్పంచ్‌తో ఇతర ప్రజాప్రతినిధులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో దిగ్బంధం చేశారు. నిర్వాసితులందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో పాటు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన తర్వాతే వీటిని అందించాలని కోరారు. ఇంటి నిర్మాణం కోసం కేటాయించిన ప్లాట్లలో విద్యుత్ స్తంభాలతో పాటు నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా.. దిగ్బంధం చేసిన వారిని మధ్యాహ్నం వదిలేశారు.

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బుధవారం ఏకాదశిని పురస్కరించుకొని ముఖ మండపంలోని శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు లక్ష పుష్పార్చన పూజ నిర్వహించారు. శ్రీస్వామి అ మ్మవార్లను బంగారు సింహాసనంపై అధిష్టించి, వివిధ రకాల లక్ష పుష్పాలతో, తులసీ ప త్రాలతో పుష్పార్చన జరిపించారు. సుమారు గంటన్నర పాటు ఈ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ రామకృష్ణారావు, అధికారులు, ఆచార్యులు, భక్తులు పాల్గొన్నారు. ఇక ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి.

సెమినార్లను సద్వినియోగం చేసుకోవాలి

ఎంజీయూ (నల్లగొండ రూరల్) : సెమినార్లను విద్యార్థులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. యూనివర్సిటీలో మార్చి 3, 4వ తేదీల్లో నిర్వహించే గణిత సెమినార్ పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రవి, హైమావతి, మద్దిలేటి, ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ గోపాల్‌రెడ్డి

బస్టాండ్ ప్రారంభం.. పరిశీలన



యాదాద్రి కొండకు దిగువన గండి చెరువు సమీపంలో నిర్మించిన బస్‌స్టేషన్‌ను బుధవారం ప్రారంభించిన అనంతరం పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్, ప్రభుత్వ విప్ తదితరులు - వివరాలు 18లో

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి



గాంధీనగర్ ప్రాథమికోన్నత పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కృష్ణారెడ్డి, చిత్రంలో కలెక్టర్, అదనపు కలెక్టర్

భువనగిరి : కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. మన ఊరు – మన బడి, మన బస్తీ – మన బడి కార్యక్రమంలో భాగంగా భువనగిరి పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలతో తీర్చిదిద్దినట్లు తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ పాఠశాలల్లో 12 అంశాలకు సంబంధించి మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. అంతకుముందు పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, రీడింగ్ కార్నర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్, జిల్లా రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ కోల్పుల అమరేందర్, మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ కిష్టయ్య, ఎంపీపీ నిర్మల, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, కౌన్సిలర్లు లక్ష్మి, స్వామి, డీఈఓ నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ సంపత్ కుమార్, ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి అండాలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ క్లాసులు వింటున్న విద్యార్థులు

క్లుప్తంగా

యాదాద్రి ఇన్‌చార్జ్ ఈఓగా రామకృష్ణారావు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఇన్‌చార్జ్ ఈఓగా దేవాదాయశాఖ ఆర్‌జేసీ రామకృష్ణారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆలయ ఈఓగా విధులు నిర్వహిస్తున్న ఈఓ గీతారెడ్డి ఈ నెల 18వ తేదీ వరకు సెలవుల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రానికి ఇన్‌చార్జ్ ఈఓగా రామకృష్ణారావు వచ్చారు. గతేడాది పలుమార్లు ఈఓ గీతారెడ్డి సెలవుల్లో ఉన్నప్పుడు కూడా రామకృష్ణరావు ఇన్‌చార్జ్ ఈఓగా వ్యవహరించారు. బుధవారం జరిగిన ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభోత్సవం, పాతగుట్ట ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్యులు ఆయనకు ఆశీర్వచనం చేశారు.

మతోన్మాదులకు గుణపాఠం చెప్పాలి



పార్టీ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తున్న సీతారాములు

తుర్కపల్లి: మతోన్మాదులకు ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ ప్రధాని కాకముందు మామూలు వ్యాపారిగా ఉన్న గౌతమ్ అదానీ కుబేరుడిగా మారాడాని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలు మరింత పేదలుగా మారిపోయారని ఆవేదనవ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మహ్మద్ జాహంగీర్, కల్లూరి మల్లేశం, పోతరాజు జాహంగీర్, లింగయ్య, రాజు, మాతయ్య, దార్ల దుర్గయ్య, కళమ్మ, వెంకటేశం, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో వ్యక్తి మృతి

నల్లగొండ క్రైం : అనారోగ్య కారణాలతో నల్లగొండని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ఓ వ్యక్తి మృతిచెందాడు. తిప్పర్తి మండలం నూకలవారిగూడేనికి చెందిన నూకల పరమేష్(44) పెద్దవూరలో ఉన్న సోదరి వద్దకు వెళ్లేందుకు తిప్పర్తిలో బస్సు ఎక్కాడు. నల్లగొండ బస్టాండ్‌కు చేరుకున్న తర్వాత పరమేష్ పెద్దవూర వైపు వెళ్లే బస్సు ఎక్కేందుకు ఎదురుచూస్తున్న క్రమంలో అకస్మాత్తుగా ఫిట్స్, గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలి మృతిచెందాడు. మృతుడి సోదరుడు లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

రేపు డైట్‌లో సర్టిఫికెట్ల పరిశీలన

నల్లగొండ : డీఈఈ సెట్ 2022 అర్హత సాధించిన డీఈఐఈడీ , డీపీఎస్ఈ రెండేళ్ల కోర్సుకు సంబంధించి నల్లగొండ డైట్ కళాశాలలో శుక్రవారం మూడో విడత సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ నర్సింహా ఒక ప్రకటనలో తెలిపారు. 3న సర్టిఫికెట్ల పరిశీలన, అర్హులైన వారు 6 నుంచి 9వ తేదీలోపు ఆప్షన్లు ఎంచుకోవాలని , 14న సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

భక్తుల సౌకర్యాల కల్పనకు కృషి



బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డిగోవర్ధన్, చిత్రంలో ప్రభుత్వ విప్ సునీత, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, గొంగిడి మహేందర్‌రెడ్డి

- దేశమంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటోంది
- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- యాదగిరిగుట్టలో బస్‌స్టేషన్ ప్రారంభం



బస్టాండ్‌ను ప్రారంభిస్తూ రిబ్బన్ కట్‌చేస్తున్న మంత్రి, ప్రభుత్వ విప్, ఆర్టీసీ చైర్మన్ గోవర్ధన్

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు సీఎం కేసీఆర్ చేస్తున్నారని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. యాదాద్రి కొండకు దిగువన గండి చెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను ఆ సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి క్షేత్రానికి వచ్చే భక్తులకు ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు 5 ఎకరాల స్థలంలో సుమారు రూ.7కోట్ల వ్యయంతో సువిశాలమైన స్థలంలో బస్టాండ్ నిర్మాణం జరిగిందన్నారు. సీఎం కేసీఆర్ దేశంలో అద్భుతమైన ఆలయంగా యాదాద్రిని పునః నిర్మాణం చేశారన్నారు. ప్రస్తుతం యాదాద్రి క్షేత్రానికి 20వేలకుపైగా, శని, ఆదివారాల్లో 35వేలకు పైగా భక్తులు వస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో లక్షకు పైగా భక్తులు ఈ క్షేత్రానికి వచ్చి స్వామిని దర్శించుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో దేశమంతా మన రాష్ట్రం వైపు చూస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏ రాష్ట్రం అభివృద్ధి కాలేదని విమర్శించారు. కానీ సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో తెలంగాణను తక్కువ సమయంలోనే గొప్ప అభివృద్ధి చేశారని, దీంతో ప్రస్తుతం దేశ ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్టీసీ ఈడీ పురుషోత్తం నాయక్, ఆర్ఎం శ్రీదేవి, జాయింట్ కలెక్టర్ దీపక్ తివారీ, ఇన్‌చార్జ్ ఈఓ రామకృష్ణారావు, ఆర్డీఓ భూపాల్‌రెడ్డి, డిపో మేనేజర్ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ తదితరులున్నారు.

జలప్రసాదం ప్రారంభం

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా దివీస్ లాబోరేటరీస్ లిమిటెడ్ యాజమాన్యం ఏర్పాటు చేసిన జల ప్రసాదం (ఆర్వో వాటర్ ప్లాంట్)ను ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అంతకు ముందు ఆర్టీసీ ఈడీ పురుషోత్తంతో కలిసి చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



జలప్రసాదాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ గోవర్ధన్

ధ్వజారోహణం.. దేవతాహ్వానం



పాతగుట్ట ఆలయ వీధుల్లో స్వామివారి ఊరేగింపు

- పాతగుట్టలో రెండో రోజుకు చేరిన బ్రహ్మోత్సవాలు
- నేడు అలంకార సేవ.. ఎదుర్కోలు మహోత్సవం



భేరీ పూజ నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం విశేష పర్వాలు జరిగాయి. ఉత్సవ విశిష్టతను లోకమంతా చాటి, సకల దేవతలను ఆహ్వానించే తతంగాన్ని ఆచార్యులు నిర్వహించారు. అంకురార్పణ తదుపరి నిర్వహించే వేడుక ధ్వజారోహణం. భగవానుడి వాహనం అయిన గరుడ ఆళ్వారును కొత్త వస్త్రంపై చిత్రించి పూజాధికములు నిర్వహించి, గరుడ ఆళ్వారుడికి ప్రత్యేక ఆరాధన చేశారు. ఊరేగింపుగా ధ్వజ పటాన్ని ధ్వజ స్తంభం వరకు తీసుకెళ్లారు. అక్కడ గరుడ ఆళ్వారుడికి ఇష్టమైన పదార్థాలను (గరుడ ముద్దలను) నైవేద్యంగా సమర్పించారు. గరుడస్వామికి ఇష్టమైన వంటకాల సమర్పణలో అష్టరాగాల ఆలాపన చేసి, ధ్వజారోహణం నిర్వహించారు. ఈ కార్యక్రమంతో ఉత్సవ వైభవం విశ్వజనులకు చేరిందని ఆచార్యులు చెప్పారు. గరుత్మంతుడికి సమర్పించిన నైవేద్యం ప్రసాదాలను ఆచార్యులు భక్తులు, నిర్వాహకులకు అందజేశారు. ధ్వజారోహణం దర్శించిన భక్తులకు పాపవిమోచనం, విష్ణులోక ప్రాప్తి, మనోరథసిద్ధి వంశావృద్ధి, సమాజ శ్రేయస్సు తదితర విశేష ఫలితాలు కలుగుతాయని ఆచార్యులు తెలిపారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ రామకృష్ణారావు, ఆచార్యులు, అధికారులు పాల్గొన్నారు.

సాయంకాలం...

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిత్యారాధనల అనంతరం వేదపారాయణికులచే వేదపారాయణం, మూలమంత్ర, అనుష్ఠానముల గావించారు. అనంతరం సాయంత్రం బేరీపూజ, దేవతాహ్వానం ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞాచార్య బృందం, అర్చకులు, పారాయణికులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

భేరీ పూజ.. దేవతాహ్వానం..

శబ్దం భగవంతుని స్వరూపం కనుక శబ్దనాములతో భగవానుని ఆరాధించుట ఈ వేడుకలోని ప్రత్యేక అని ఆచార్యులు పేర్కొన్నారు. ఆయా రాగ, తాళ, వాయిద్యములతో వేద మంత్ర ఉచ్చారణలతో బ్రహ్మాది దేవతలను ఆహ్వానించి ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించుటే ఈ దేవతాహ్వానం వేడుకని ఆచార్యులు వెల్లడించారు.

నేడు అలంకార సేవ.. ఎదుర్కోలు

నృసింహుడికి ఇష్టమైన అలంకార సేవలు గురువారం ప్రారంభం కానున్నాయి. స్వామివారిని ఉదయం హవన పూజలు జరిపించిన తరువాత సింహ వాహనంపై అలంకారం చేసి తిరువీధుల్లో సేవ నిర్వహిస్తారు. ఇక రాత్రి శ్రీస్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అశ్వవాహనంపై ఊరేగుతూ తిరువీధుల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

చెర్వుగట్టులో వైభవంగా దోపోత్సవం



దోపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



హోమం పూజల్లో పాల్గొన్న ఈఓ తదితరులు

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున వైభవంగా దోపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామలింగేశ్వర శర్మ, సురేష్, సతీష్, శ్రీకాంత్‌శర్మ, అర్చక బృందం ఆధ్వర్యంలో వేదమంత్రాలతో దోపోత్సవం, మహా బలిహరణ, మహా పూర్ణాహుతి, ధ్వజారోహణం, ఏకాదశ రుద్రభిషేకం, జ్యోతి లింగార్చన, ఏకాంత సేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధికారి నవీన్‌కుమార్ సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, శంకర్, శ్రీనివాసరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజయ్య, వెంకటయ్య, వంశీధర్‌రావు, రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేలుడు పదార్థం తిన్న ఆవు

- నోట్లో పేలడంతో మృతి

రాజాపేట : పేలుడు పదార్థం తిని ఓ ఆవు మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని రామచంద్రగూడెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు బక్కెన శివుడు వ్యవసాయ పొలం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు అడవిపందుల కోసం ఆహారంలో పేలుడు పదార్థం పెట్టారు. దానిని ఆవు వెళ్లి తినడంతో నోటిలో పేలి మృతిచెందింది. సుమారు రూ. 40వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు శివుడు ఆవేదనవ్యక్తం చేశాడు.

బయో ఆర్గానిక్‌పై విద్యార్థుల ప్రదర్శన

గరిడేపల్లి : గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా లయోలా కళాశాలకు చెందిన విద్యార్థులు గరిడేపల్లిలోని రైతుల పొలాల్లో బయో ఆర్గానిక్ సముద్ర కలుపుసారంపై బుధవారం ప్రదర్శన నిర్వహించారు. బయో ఆర్గానిక్ మొక్కల పెరుగుదలకు ఉపయోగించబడుతుందని పేర్కొన్నారు. సహజ సిద్ధమైన పదార్థాలతో తయారు చేసిన జీవ ఉత్తేజకమని తెలిపారు. ఇది సముద్రపు మొక్కల నుంచి తయారు చేయబడి పంటలలో నాణ్యమైన అధిక దిగుబడులిచ్చే సేంద్రియ పదార్థాల నిధి అని తెలిపారు. దీనిని ఉపయోగించిన పంటలు క్లిష్టమైన వాతావరణ పరిస్థితులు నుంచి రక్షణ పొంది, పూలు, పండ్లు, రాలిపోవుటను నివారిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శాస్త్రవేత్త లవకుమార్, మానస, జ్ఞానసిరి, శ్రీనిధి, ఆకర్షరెడ్డి, హారిక, అఖిల, కాట సింధు ప్రియ ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే యాత్ర

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీపీసీసీ ప్రధానకార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి

చౌటుప్పల్ : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రామాల్లో యాత్ర నిర్వహిస్తున్నామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి తెలిపారు. హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రను బుధవారం చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురంలో ఉన్న శ్రీఆంథోల్ మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. అక్కడి నుంచి జైకేసారం గ్రామం వరకు కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ సందర్భంగా చలమల్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో 70రోజుల పాటు గడపగడపకు వెళ్లి ప్రజలను కలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆకుల ఇంద్రసేనారెడ్డి, కార్యదర్శి సుర్వి నర్సింహగౌడ్, నాయకులు జీంద్రు అంజిరెడ్డి, గూడూరు వెంకట్‌రెడ్డి, మునుకుంట్ల రాజు, పన్నాల రాజిరెడ్డి, నర్సింహారెడ్డి, కేతరాజు అచ్చయ్య, ఏదుల అరవింద్‌రెడ్డి, తీగుళ్ల చంద్రయ్య, బోయ దేవేందర్, దోర్నాల శ్రీనివాస్, మాదగోని శేఖర్, బొడ్డు జంగయ్య, మేకల దేవేందర్‌రెడ్డి, బండారు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, ఎడ్ల రాఘవరెడ్డి, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

'గుట్ట' మున్సిపల్ అవిశ్వాసంపై హైకోర్టు స్టే..



మున్సిపల్ చైర్‌పర్సన్ సుధాకు స్వీట్ తినిపిస్తున్న కోఆప్షన్ సభ్యురాలు పద్మ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టవద్దంటూ హైకోర్టు స్టే ఇచ్చింది. ఈ విషయాన్ని చైర్‌పర్సన్ సుధా హేమేందర్‌గౌడ్ బుధవారం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుధా హేమేందర్‌గౌడ్‌పై గత నెల 30 తేదీన 5వ వార్డు కౌన్సిలర్ గుండ్లపల్లి వాణి భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో పది మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి అందజేశారు. ఈ నేపథ్యంలో చైర్ పర్సన్ సుధా హైకోర్టును ఆశ్రయించారు. పిటీషన్‌ను పరిశీలించిన హైకోర్టు.. అవిశ్వాస పెట్టవదని స్టే ఇచ్చినట్లు సుధా తెలిపారు. ఇందుకు సంబంధించిన స్టే ఆర్డర్ కాపీ గురువారం అందనున్నట్లు చెప్పారు.

చైర్‌పర్సన్ మద్దతుదారుల సంబురాలు

మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్ గౌడ్‌కు అనుకూలంగా హైకోర్టులో స్టే వచ్చిందని పట్టణ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు సంబరాలు చేసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌కు మిఠాయి తినిపించి సన్మానం చేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు గోర్ల పద్మ, పేరబోయిన పెంటయ్య, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెలిమెల్లి శ్రీధర్‌గౌడ్, నాయకులు కీసరి బాలరాజు, గుండపల్లి లింగం, ఆరె శ్రీధర్, శివరాత్రి మహేష్, సయ్యద్ బాబా, గుండ్లపల్లి శ్రీరామ్‌గౌడ్, చంద్రం, రజనీకాంత్ ఉన్నారు.

పెద్దగట్టు జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి



జాతర పనులు పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

చివ్వెంల(సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్దదైన శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర ఈనెల 5 నుంచి తొమ్మిది వరకు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం దురాజ్‌పల్లి గ్రామ శివారులోని లింగమంతుల స్వామి ఆలయాన్ని పరిశీలించారు.స్నానాల గదులు, కోనేరు పనులు, మంచినీటి కోసం వాటర్ ట్యాంకు, పార్కింగ్ కోసం స్థల సేకరణ పనులను పరిశీలించి మాట్లాడారు. జాతర అభివృద్ధికి రూ.6.50 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసియాలోనే అతిపెద్దదిగా చెప్పుకునే ఈ జాతరకు రాష్ట్రం నుంచే కాకుండా దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాల నుంచి 20 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పరంగా ఇప్పటికే కోట్ల రూపాయలు కేటాయించి పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలపై అధికారులు దృష్టి సారించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కేశారం గ్రామానికి చెందిన మెంతబోయిన వంశస్తుల కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై అక్కడికి వచ్చిన భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులు యాదవ్, గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, పెన్‌పహాడ్ ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీజీ భుక్యా సంజీవ్ నాయక్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్ రెడ్డి, నాయకులు జటంగి వెంకటేశ్వర్లు యాదవ్, కాసం శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న కమలానందభారతీ స్వామి



స్వామివారి సన్నిధిలో కమలానంద భారతీ స్వామి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని భువనేశ్వరి పీఠాధిపతులు కమలానంద భారతీ స్వామిజీ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ హిందూ దేవాలయాల పరిరక్షణ, గో సంరక్షణ, ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ, సనాతన ధర్మ రక్షణకై బాసర నుంచి కర్ణాటక రాష్ట్రంలోని హంపి విజయనగరం వరకు పదివేల కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కమాలనంద భారతీ స్వామిజీ వెంట శ్రీతీర్థ పీఠాధిపతులు వివేకానంద స్వామిజీ, హిందూ దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కట్టిగొమ్ముల రవీందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వరుణ్‌రెడ్డి తదితరులున్నారు.

అత్తింటి ఎదుట వివాహిత ఆందోళన

సూర్యాపేట క్రైం : న్యాయం చేయాలంటూ అత్తింటి ఎదుట ఓ వివాహిత ఆందోళనకు దిగింది. ఈ ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు..నకిరేకల్‌కు చెందిన షేక్ లతీఫ్, జుబేదా కుమార్తె షేక్ నిష్మాకు పెద్దల సమక్షంలో స్థానిక మార్కెట్ వద్ద నివాసం ఉంటున్న షేక్ మౌలానాతో 2013లో వివాహం జరిగింది. పది సంవత్సరాల నుంచి భర్త అత్త,మామ, ఆడపడుచులు తనను వేధిస్తున్నారని షేక్ నిష్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో తన భర్త ఖమ్మం జిల్లాకు చెందిన హుస్సేన్ బినిని వివాహం చేసుకొని హైదరాబాదులో కాపురం పెట్టారని తెలిపింది. రెండో వివాహం చేసుకున్న తన భర్తపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితురాలు కలెక్టర్, ఎస్పీకి విజ్ఞప్తి చేసింది. ఆమె వెంట తల్లిదండ్రులు, సోదరుడు, కుటుంబ సభ్యులు, జన జాగతి మహిళా సంఘం గోపమ్మ, సైదాబీ, నాగమణి పాల్గొన్నారు.

టి వ్యాలెట్ వినియోగంపై అవగాహన

ఎంజీయూ(నల్లగొండ రూరల్) : ఉపకార వేతనాలు పొందే విద్యార్థులు టి వ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని యూనివర్సిటీ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ అంజిరెడ్డి సూచించారు. బుధవారం యూనివర్సిటీలో నిర్వహించిన టి వ్యాలెట్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవి, శేఖర్ రెడ్డి, కృష్ణ, ఫణి, మురళి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడు 'మందడి' హఠాన్మరణం

- నివాళులర్పించిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, నేతలు చాడ, పల్లా





హైదరాబాద్‌లో నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు



నర్సింహారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని తదితరులు



చండూరు సీపీఐ కార్యాలయంలో మందడి మృతదేహంపై ఎర్ర జెండా కప్పుతున్న నాయకులు

చండూరు : సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు, చండూరు వైస్ ఎంపీపీ మందడి నర్సింహారెడ్డి(57) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన చండూరు మండలం పుల్లెంలలోని స్వగృహంలో ఉండగా తెల్లవారుజామున కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే నర్సింహారెడ్డిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 9గంటలకు తుదిశ్వాస విడిచారు. నర్సింహారెడ్డికి భార్య, కూతురు ఉన్నారు. ఈయన 1984లో యువజన సంఘం (సీపీఐ అనుబంధం)లో చేరి యువజనుల హక్కుల కోసం పోరాటం చేశారు. 1993లో పార్టీ చండూరు కార్యదర్శిగా ఎన్నికై 2008 వరకు 15ఏళ్ల పాటు కొనసాగారు. అనంతరం జిల్లా కార్యవర్గ, రాష్ట్ర సమితి సభ్యుడిగా పనిచేశారు.

రెండు పర్యాయాలు వైస్ ఎంపీపీగా...

నర్సింహారెడ్డి 2000 నుంచి 2005 వరకు చండూరు మండల వైస్ ఎంపీపీగా, 2019లో రెండో సారి ఎంపీటీసీగా ఎన్నికై తిరిగి వైస్ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టి కొనసాగుతున్నారు.

నర్సింహారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

చండూరు వైస్ ఎంపీపీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మందడి నర్సింహారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని పుల్లెంల గ్రామంలో నర్సింహారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మందడి మృతి తనను ఎంతగానే బాధించిందని కన్నీటిపర్యంతమయ్యారు. అంతకుముందు పార్టీ కార్యకర్తల సందర్శనార్థం మందడి మృతహాన్ని చండూరు సీపీఐ కార్యాలయంలో ఉంచగా పార్టీ జాతీయ కార్యకర్గ సభ్యులు చాడ కిషన్‌రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఐ, సీపీఎ జిల్లా కార్యదర్శులు నెల్లికంటి సత్యం, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, నలపరాజు సతీష్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. కొండాపురంలో కూడా పార్టీ గ్రామ కమిటీ సంతాపం ప్రకటించింది. కార్యక్రమంలో నాయకులు రత్నాకర్‌రావు. బచ్చనబోయిన గాలయ్య, పగిళ్ల శేఖర్, సంజీవ ఉన్నారు. అదే విధంగా ఎంపీడీఓ కార్యాలయంలో కూడా నర్సింహారెడ్డి చిత్రపటానికి ఉద్యోగులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాకూబ్ నాయక్, టీజీఎఫ్ రాష్ట అధ్యక్షుడు పల్లె రవికుమార్, ఎంపీటీసీలు పల్లె వెంకన్న, గౌరిగె సత్తయ్య, కావలి మంగమ్మ, ఏఈ రమేష్, తదితరులు ఉన్నారు.